# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 21, ఏప్రిల్ 2026


## ఇళ్ల గణనలోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్: 20, ప్రభాతవార్త :**

ఇళ్ల గణనలోని ప్రతి అంశం పై ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు అవగాహన కలిగి వుండాలని కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరి బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హరిత హాజరయ్యారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభ గణన 2027 లో భాగంగా మొదటి విడత మే 11 నుండి జిల్లా వ్యాప్తంగా ఇళ్ల గణన కార్యక్రమము చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఇంటి యజమాని నుండి తీసుకోవలసిన వివరాలపై ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు ప్రతి అంశం పై అవగాహన కలిగి వుండాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఇళ్ల గణన ప్రక్రియను చేపట్టాలన్నారు. హౌసింగ్ బ్లాక్ పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమములో ఎన్యూమరేటర్లు, మిగతా 2లో..



## వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

**❋ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్**

**ఉట్నూర్, ఏప్రిల్ 20,ప్రభాతవార్త :**

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటిడిఎ అర్థమయ్యే రీతిలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ ఉపాధ్యాయులను ఆదేశించారు.సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు)ఉట్నూర్ ను ప్రాజెక్ట్ అధికారి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇష్ట గోష్టితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా సమయానికి భోజనాన్ని అందిస్తున్నారా మెనూ ప్రకారంగా అందిస్తున్నారా భోజనాలు రుచికరంగా ఉన్నాయా అని తెలుసుకొని క్లాస్ రూమ్ లో విద్యార్థులతో ముచ్చటించి వారికి పాటలను బోధించారు విద్యార్థులకు వండిన ఆహారాన్ని రుచిని ఆస్వాదించారు, అలాగే కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, నర్సులతో మిగతా 2లో..



## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

**★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో రాజీవ్ నగర్‌లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. వంటశాల, సామాగ్రి నిల్వ గదిని పరిశీలించి ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో అనుత్తీర్ణులైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆదర్శ పాఠశాలల వసతి గృహాన్ని సందర్శించి కొనసాగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్

**సారంగాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం మండలంలోని స్వర్ణ గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్, భోజన సౌకర్యాలతో పాటు మరుగుదొడ్లను, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**❋ రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**

**నస్పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**






ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ రాష్టంలో త్వరలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమములో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితాను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ప్రతి ఇంటింటిని సందర్శించి వివరాలు సేకరించాలని తెలిపారు. గ్రామాలలో సెర్ప్ సిబ్బంది, మున్సిపాలిటీలలో మెప్మా సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని, సెర్ప్, మెప్మా సిబ్బందితో ఓటరు జాబితాపై ప్రత్యేక సమగ్ర సవరణపై విస్తృత ప్రచారం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో మ్యాపింగ్ చేసుకునేలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో స్పష్టమైన జాబితా రూపకల్పన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, డీఈఓ భోజన్న, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎంపీఓ అజీజ్ ఖాన్, ఎంఈఓ మహేందర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

(మొదటిపేజీ తరువాయి)

ఐటీడీఏ పల్స్ యాప్ పనితీరుపై ఆరా తీశారు, పల్స్ యాప్ పై ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు, ఆర్ ఓ ప్లాంట్ పనితీరును పరిశీలించారు, ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు వార్డెన్, ప్రిన్సిపల్కు, కామటీ, వంట పని వారు, శానిటరీ మరియు మల్టీపర్పస్ వర్కర్లు కు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తే సహించం

## - ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అధికారులను హెచ్చరించారు. సోమవారం లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే అధికారులతో ఫోన్లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన తర్వాత రవాణా సమస్యలు, గన్నీ సంచుల కొరత సాకులు చెబుతూ జాప్యం చేయడంపై ఆయన మండిపడ్డారు. రైస్ మిల్లర్లు కోత పేరుతో రైతులను వేధిస్తే వారితో కలిసి రాస్తారోకో చేస్తానని హెచ్చరించారు. గత పదేళ్ల పాలనలో రైస్ మిల్లర్లు రైతులను నిలువునా దోచుకున్నారని, ఇకపై అటువంటి నాటకాలు చెల్లవని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఐకేపీ ద్వారా పారదర్శకమైన కొనుగోళ్లు చేపడుతున్నామని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

# ఇళ్ల గణనలోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

సూపర్‌వైజర్లు, ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.త్రాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు వేసవి కాలం దృష్ట్యా మారుమూల గ్రామాల ప్రజలకు త్రాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మిషన్ భగిరథ, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగుల హాజరు రిజిస్టరు పరిశీలించి అధికారులు, ఉద్యోగులు సమయ పాలన పాటించి ప్రజలకు మేలైన సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మారుమూల గ్రామాలకు మిషన్ భగిరథ నీరు అందించాలన్నారు. ఎక్కడైన నీళ్ళ సరఫరాలలో జాప్యం జరిగితే వెంటనే ఇంజినీరింగ్ అధికారులు, మరమ్మత్తులు చేపట్టి నీరు అందించాలన్నారు. నీరు సరఫరా కాని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పని చేసి త్రాగు నీటికి ఇబ్బందులు లేకుండా సమిష్టితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమములో మిషన్ భగిరథ ఈ ఈ సిద్దిక్ మిషన్ భాగిరథ, పంచాయతి రాజ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి వివేక్‌ను విమర్శించే అర్హత బాల్క సుమన్‌కు లేదు

## - అభివృద్ధి పనులను చూస్తూ ఓర్వలేకే మంత్రిపై విమర్శలు - కమీషన్ల రాజకీయాలు కాంగ్రెస్ పార్టీలో ఉండవు

## - బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నాయకుల మండిపాటు

చెన్నూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజాసేవ చేస్తూ ప్రజల కోసం అభివృద్ధి పనులు చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామిని విమర్శించడం బాల్క సుమన్‌కు సరికాదని చెన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై విమర్శలు గుప్పించారు. బాల్క సుమన్ చెన్నూరు ప్రజలకు చేసిందేమీ లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంతా కమిషన్ల రాజకీయమేనని ఎద్దేవా చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి చెన్నూరు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బాల్క సుమన్ మంత్రిపై అభాండాలు వేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని ఒకరిద్దరు వెళ్లినంత మాత్రాన పార్టీకి ఎలాంటి నష్టం ఉండబోదని, పాత నీరు వెళితే కొత్తనీరు వస్తుందని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినా, అబాండాలు మోపినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వినయ్ కుమార్, కౌన్సిలర్లు అంబటి శంకర్, జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాస్, చెన్నూరి రాజేష్, శ్రీధర్, చెన్న సూర్యనారాయణ, సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# సోషల్ మీడియా ప్రచారం అవాస్తవం

మందమర్రి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలో గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో తండ్రి తన కూతురిని వేధిస్తున్నాడన్న ప్రచారం కలకలం రేపిన నేపథ్యంలో, ఆ వార్తలు పూర్తిగా అవాస్తవమని బాధిత తండ్రి కామెర ఆనంద్ స్పష్టం చేశారు. సోమవారం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చదువుకు దూరంగా ఉండి అల్లరి చేస్తున్న తన కూతురు రియాన్సిక ఉన్నతంగా చదవాలని సదుద్దేశంతో భయపెట్టేందుకు అడవి ప్రాంతం చూపించానని తెలిపారు. సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వెనుక ఉన్న చెట్ల ప్రాంతానికి తీసుకెళ్లి, చదువుకోకపోతే ఇక్కడే వదిలేస్తాను అని హెచ్చరించానని చెప్పారు. అయితే, తిరిగి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో, తనపై అసత్య ఆరోపణలు వ్యాప్తి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రచారాలతో తమ కుటుంబం తీవ్ర మానసిక ఆందోళనకు గురైందని, సమాజంలో తలెత్తుకుని తిరగలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ ఘటనపై మందమర్రి పోలీసులు విచారణ చేపట్టి ఎలాంటి తప్పు జరగలేదని నిర్ధారించినట్లు తెలిపారు. అలాగే చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కూడా విచారణ చేసి, కూతురు తండ్రి సంరక్షణలో క్షేమంగా ఉన్నట్లు పేర్కొన్నారని వివరించారు. సోషల్ మీడియాలో నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని, ఇలాంటి తప్పుడు ప్రచారాలు కుటుంబాలకు నష్టం కలిగిస్తాయని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.




ప్రెస్‌మీట్‌లో వివరణ ఇస్తున్న కామర ఆనంద్

# అంతర్జాతీయ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ పోస్టర్ ఆవిష్కరణ

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ (ఏప్రిల్ 15-30) కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ హరిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ముఖ్యంగా నేల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి చర్యలు పర్యావరణానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరిత దళం రీజనల్ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, జిల్లా కోఆర్డినేటర్ కటకం మధూకర్ పాల్గొన్నారు. పోస్టర్‌లో నేల పరిరక్షణకు సంబంధించిన ముఖ్య సందేశాలు, పంట కవర్లు పెంచడం, సేంద్రియ ఎరువుల వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలను ప్రతిబింబించారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువతలో పర్యావరణంపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు వెల్లడించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## 31 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

### - ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 31 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి దరఖాస్తుల పరిశీలనలో అధికారులు జాప్యం చేయవద్దని ఆదేశించారు. ఫైళ్లు తన వద్దకు వచ్చిన రోజే వెంటనే సంతకం చేసి ఆమోదిస్తానని, పేదలకు సకాలంలో లబ్ధి చేకూరడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఎంతో భరోసా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, సర్పంచ్ సాయన్న, మండల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎస్సై జి రమేష్‌కు ఆటో యూనియన్ ఘన సన్మానం

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఎస్సై జి. రమేష్‌ను మండల ఆటో యూనియన్ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. యూనియన్ అధ్యక్షుడు ఆజాం ఖాన్ ఆధ్వర్యంలో ఎస్సైకి శాలువా కప్పి పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, అతివేగంతో వాహనాలు నడపరాదని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, మద్యం తాగి లేదా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని కోరారు. ముఖ్యంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి ఆటో డ్రైవర్ ఖిమై ఆటో ఈజ్ సేఫ్‌ఖి క్యూఆర్ కోడ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ప్రహ్లాద్, సురేష్, విశ్వనాథ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సై రమేష్‌ను సన్మానిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

### చెరువులో మునిగి

## పశువుల కాపరి మృతి

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

మండలంలోని లక్ష్మణచాంద గ్రామానికి చెందిన కుంచపుల్ల నర్సింలు (68) అనే పశువుల కాపరి చెరువులో మునిగి మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో గ్రామానికి సమీపంలోని చెరువు వద్దకు బర్రెలను మేపడానికి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. మేత మేస్తున్న కొన్ని బర్రెలు చెరువు నీటిలోకి వెళ్లడంతో, వాటిని ఒడ్డుకు చేర్చడానికి నర్సింలు నీటిలోకి దిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు లోతైన ప్రాంతానికి వెళ్లి నీటిలో మునిగి చనిపోయారు. మృతుని కుమారుడు కుంచపుల్ల సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణచాంద ఎస్సై శ్రావణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వడ్డెర కులానికి చెందిన వ్యక్తి కాగా, ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



## ఆత్మ డైరెక్టర్ సింగరపు స్వామిని పరామర్శించిన ఆడే గజేందర్

**నేరడిగొండ, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన బోథ్ బ్లాక్ ఆత్మ డైరెక్టర్ సింగరపు స్వామిని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్ సోమవారం పరామర్శించారు. ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వామి గాయపడిన విషయం తెలుసుకున్న ఆయన, నేడు బాధితుడి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏలేటి మోహన్ రెడ్డి, తల్లా నారాయణ, బద్దం పోతారెడ్డి, ఎండి. సద్దాం, వార్డు సభ్యులు రమేష్ రెడ్డి, సుంకు వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సింగరపు స్వామిని పరామర్శిస్తున్న ఆడే గజేందర్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్ జ్యోత్స్న

## విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి

**తాండూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**

విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని తాండూర్ తహసిల్దార్ జ్యోత్న అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తహసిల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందించాలన్నారు. ఆమె వెంట నాయబ్ తహసిల్దార్ కల్పన, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, సిబ్బంది ఉన్నారు.



కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మామిడాల లలిత

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**తాండూర్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

ఉపాధి హామీ పథకం కూలీలకు సోమవారం రాజీవ్ నగర్ సర్పంచ్ మామిడాల లలిత, ఎంపీడీవో శ్రీనివాస్ మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు, తాగునీరు పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో పని చేస్తున్న కూలీలు వడదెబ్బకు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని పనులు చేయాలని సూచించారు. ప్రభుత్వం కూలీలకు ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, నాయకులు మామిడాల రాజేశం, కార్యదర్శి రమ, తదితరులు పాల్గొన్నారు.

### జనగణన శిక్షణ

## తరగతులు ప్రారంభం

**తాండూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**

తాండూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (జెడ్.పి.ఎస్.ఎస్)లో సోమవారం జనగణన శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులను తహసిల్దార్ జ్యోత్స్న పరిశీలించారు. శిక్షణకు హాజరయ్యే సూపర్వైజర్లు, ఎన్యూమెటర్లకు పూర్తిస్థాయిలో అన్ని అంశాలలో పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలని సూచించారు. తహసిల్దార్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 22 వరకు మొదటి దశ, ఈనెల 24 నుంచి 26 వరకు రెండోదశ శిక్షణ తరగతులు కొనసాగుతాయని అన్నారు. తహసిల్దార్ వెంట నాయబ్ తహసిల్దార్ కల్పన, తదితరులున్నారు.



జనగణన శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న తహసిల్దార్ జ్యోత్స్న


మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సర్పంచ్ లక్ష్మణ్

## ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మార్నింగ్ వాక్

**తాండూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి మార్నింగ్ వాక్ అనే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. సోమవారం ఉదయం 8 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి మార్నింగ్ వాక్ ప్రారంభించి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒకరికి అందాలనే లక్ష్యంతో మార్నింగ్ వాక్ అనే కార్యక్రమాన్ని చేపట్టానన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మార్నింగ్‌వాక్‌లో పంచాయతీ సెక్రెటరీ అల్లావుద్దీన్, వార్డు సభ్యులు గొర్లపల్లి బానేష్, కత్తెర్ల రవికుమార్, నాయకులు జోరిగల రమేష్, పుప్పాల శ్రీనివాస్, నారా సంజీవ్, బీమేష్, శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధల మధ్య పోచమ్మ తల్లి పునః ప్రతిష్ఠాపన

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



పెంచికల్ పేట్ మండలంలోని ఎల్లూర్ గ్రామంలో గ్రామదేవత పోచమ్మ తల్లి ఆలయ పునః నిర్మాణంతో పాటు, అమ్మవారి పునః ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు, గ్రామ పెద్దలు, ప్రజల సమక్షంలో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠపాన చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, యజ్ఞాలు, హోమాలు, వీర ఖడ్గలు, పెద్ద ఎత్తున నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో భక్తి వాతావరణాన్ని నెలకొల్పాయి. మూడు రోజుల పాటు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చప్పిడి రవిందర్, ఎస్సై అనిల్ కుమార్, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలతో పాటు, చుట్టూ ప్రక్కల గ్రామల భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మండల అధికారులు

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ బీసీ బాలుర, బాలికల వసతి గృహాలతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్, కేజీబీవీ విద్యాలయాలను అధికారులు సందర్శించారు. ఈ తనిఖీల్లో భాగంగా విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత, వసతి గృహాల్లోని పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. వసతి గృహాల రికార్డుల నిర్వహణను తనిఖీ చేసి, విద్యార్థుల సంక్షేమంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిర్లక్ష్యం వహించకుండా నాణ్యమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో అరుణ రాణి, ఎంఈఓ సదానందం తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**నిర్మల్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

నిర్మల్ బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని పలు పనులను ప్రారంభించారు. తొలుత నిర్మల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. డిజిటల్ విధానంలో పోషణ, ఆరోగ్య వివరాల నమోదుకు ఇవి ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం అదే ప్రాంగణంలో బసవేశ్వర జయంతి వేడుకలను నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుల, లింగ వివక్ష లేని సమసమాజ స్థాపనకు బసవేశ్వరుడు చేసిన కృషిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనియాడారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తూ సారంగాపూర్ మండలం అల్లూరులో మొక్కజొన్న, వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మొక్కజొన్నకు ..2,400, వడ్లకు ..2,389 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలుపుతూ, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని హితవు పలికారు. అనంతరం నిర్మల్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ..5 లక్షల ఎంపీలాడ్స్ నిధులతో కమ్యూనిటీ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సొన్ మండలం జాఫ్రాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్‌ను ప్రారంభించి, స్థానిక పారిశ్రామికాభివృద్ధికి తన మద్దతు ప్రకటించారు. చివరగా దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో ..15.45 లక్షలతో చేపట్టనున్న పెద్ద చెరువు శాశ్వత మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ మరమ్మతులు పూర్తయితే రైతులకు, పాడి పశువులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బీజేపీ అధ్యక్షులు రితేష్ రాథోడ్, రావుల రాంనాథ్, వివిధ మండలాల సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

ప్రజావాణిలో వచ్చిన ప్రతీ ధరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం అర్జీదారుల నుండి ధరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో ముఖ్యంగా భూమి సమస్యలు పరిష్కరించాలని, పెన్షన్ అందించాలని, ఉద్యోగం ఇప్పించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పలువురు కలెక్టర్ కు మొరపెట్టుకున్నారు. ఈ ప్రజావాణిలో అధికారులు, ధరఖాస్తు దారులు పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏడి మిలింద్

## నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ ఏడి మిలింద్ సూచించారు. అక్షయ తృతీయ పురస్కరించుకొని సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక మెహర్ సాయి విత్తనాలు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు సకాలంలో పంపిణీ చేసి పత్తి దిగుబడికి సహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విత్తనాల దుకాణం యజమాని తాటిపల్లి ఆశిష్, రైతులు పాల్గొన్నారు.

## వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**



మండలంలోని అల్లూరు గ్రామంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గరిష్ఠ మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. మొక్కజొన్నకు 2,400 రూపాయలు, వరి ధాన్యంలో ఏ గ్రేడ్ రకానికి 2,383 రూపాయలు, సాధారణ రకానికి 2,369 రూపాయల మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లూరు సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, మండల బీజేపీ అధ్యక్షుడు కాల్వ నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

**సారంగాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

మండలంలోని జాం గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ కరిపె రవళి విలాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆమెను కలిసి గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. గ్రామంలో ఇటీవల మంజూరైన మహిళా సమైక్య భవనాలు, అంతర్గత సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సజావుగా సాగాలంటే మొరం అవసరమని వారు తెలిపారు. పశువుల పాకలు, బురదగా ఉన్న ప్రాంతాలు, నూతన గృహాల నిర్మాణానికి మొరం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 582లో గ్రామ కనీస అవసరాల నిమిత్తం మొరం తవ్వుకునేందుకు అనుమతి ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కలెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ కరిపె రవళి విలాస్



మంచిర్యాలలో మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

# మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం కాంగ్రెస్ కుట్ర

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్**

**- నారి శక్తి వందన్ బిల్లును అడ్డుకోవడంపై బీజేపీ ధ్వజం**

నస్పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

నారి శక్తి వందన్ బిల్లును లోక్ సభలో అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించడం మహిళా ద్రోహం అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ విమర్శించారు. సోమవారం బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్లను కాంగ్రెస్ వ్యతిరేకించడం వల్ల రాష్ట్రంలో 60 మంది మహిళలు ఎమ్మెల్యేలుగా ఎదిగే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు కేంద్రం ఇస్తున్న హక్కులను కూడా కాలరాస్తోందని మండిపడ్డారు. గత 60 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లను అడ్డుకుంటూనే ఉందని రఘునాథ్ ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెరుగుతాయని వివరించారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్ వల్ల కేవలం హైదరాబాద్‌లోనే నియోజకవర్గాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. దీనివల్ల తెలంగాణలోని మిగతా జిల్లాలకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. మహిళా వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో మహిళలు బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్ లీడర్ ముకేష్ గౌడ్, కార్పొరేటర్ అనిత, బీజేపీ నాయకులు వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, వెంకటకృష్ణ, ఆంజనేయులు, స్వాతి, సుజాత, స్వప్న, రజిత, సరుతారెడ్డి, జయరాం రావు,రాజు కుమార్, స్వామి రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి అమరవీరులకు ఘన నివాళి

**- కాంగ్రెస్ ప్రభుత్వంతో అధికారికంగా సంస్మరణ దినోత్సవానికి గుర్తింపు..**

**- డీసీసీ అధ్యక్షులు ఆత్రం సుగుణ, జాదవ్ నరేష్**

ఉట్నూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద టీపీసీసీ ఉపాధ్యక్షురాలు,కొమరం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, డీసీసీ అధ్యక్షులు జాదవ్ నరేష్, ఎస్పీ అచల్ మహాజన్, ఐటీడీఏ పి ఓ యువరాజ్ మర్మాట్ లు కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆదివాసి పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చెసిన సభలో సుగుణక్క, నరేష్ జాదవ్ లు మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి సంఘటన ఆదివాసి హక్కుల కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరవలేనివని, వారి స్ఫూర్తితోనే సమాజంలో న్యాయం, సమానత్వం కోసం పోరాటం కొనసాగుతుందని అన్నారు.ఇంద్రవెల్లి చరిత్ర దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ సంస్మరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని తెలిపారు.ఆదివాసి హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు,ఆదివాసీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నార్వాయిపేట గ్రామానికి చెందిన కైరత్ పాషా తమ తాతల నుండి వారసత్వంగా వస్తున్న భూమిని కొందరు అక్రమంగా మార్చి పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సాయిని శ్రీనివాస్ తనకు హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులో గల భూమి వివరాలను భూ భారతి పోర్టల్ లో నవీకరించి పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి సాయికుమార్ తమ తాతల నుండి వారసత్వంగా వస్తున్న భూమిని తమకు ఎలాంటి సమాచారం లేకుండా కొందరు విక్రయించారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన తాళ్లపల్లి నరేష్ తాను రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట ఆన్లైన్ లో నమోదు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గుండా రవీందర్ తల్లితండ్రుల పోషణ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి అయినా తన కుమారుని నుండి ప్రతినెల నగదు ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కొత్త మాధవి, కొత్త కిరణ్ మానసిక దివ్యాంగులు అయిన తమకు పెన్షన్ ఇప్పించాలని వేరువేరుగా కోరుతూ అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ కు చెందిన లింగన్నపేట సత్యనారాయణ తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం పోతపల్లి గ్రామానికి చెందిన ఆవునూరి రాయలింగు తనకు గల భూమి ప్రభుత్వ రికార్డులలో తప్పిపోయినదని, నమోదు చేసి పట్టా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేయాలి

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బజార్‌హత్నూర్, ప్రభాతవార్త:



రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు మార్క్‌ఫెడ్ స్పెషల్ ఆఫీసర్ సంతోష్, తహసీల్దార్ శ్యామ్ సుందర్, మండల వ్యవసాయ అధికారి సౌద్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మేకల వెంకన్నలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులను ఘనంగా సన్మానించి మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందకుండా తమ పంటను సమయానుకూలంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఉండి పూర్తిస్థాయిలో ధాన్యం సేకరిస్తుందని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన ఎస్సై జి. రమేష్‌ను సన్మానించిన సర్పంచుల ఫోరం

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:

బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన నూతన ఎస్సై జి. రమేష్‌ను మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఫోరం అధ్యక్షులు పరచ సాయన్న, ఉపాధ్యక్షులు యాల్ల కృష్ణకాంత్ రెడ్డి, ఇతర గ్రామాలకు చెందిన సర్పంచులు ఎస్సైని కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను వారు ఎస్సైకి వివరించారు. అనంతరం ఎస్సై రమేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని, సర్పంచులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కొత్త వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో సర్పంచులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## ఈదురు గాలుల బీభత్సం

సారంగాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:



మండలంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈ గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని ఇళ్ల పైకప్పులు లేచిపోవడంతో గృహస్తులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పంట కల్లాలలో నిల్వ ఉంచిన మొక్కజొన్న రాశులపై కప్పిన కవర్లు గాలులకు లేచిపోయాయి. దీంతో కురిసిన కొద్దిపాటి వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతులు, బాధితులు కోరుతున్నారు. కాగా, సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పడిపోయిన చెట్లను తొలగించి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

## హేమ్లే ప్రసంజీత్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

భైంసా, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:

భైంసా పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, సమతా సైనిక్ దళ్ సభ్యుడు హేమ్లే ప్రసంజీత్‌ను అంతర్జాతీయ లూసియానా రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ ఆఫ్ సోషల్ వర్క్ పట్టాను ప్రదానం చేశారు. బౌద్ధ ధమ్మ ప్రచారం, విపశ్యన, బాలల విద్య, వ్యసనాల నిర్మూలన, సామాజిక రంగాల్లో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. రిటైర్డ్ కలెక్టర్ డాక్టర్ సాంబ మోతీరామ్, రిటైర్డ్ జడ్జి శివదాస్ మహాజన్ తదితర ప్రముఖుల సమక్షంలో యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ అన్ను కృష్ణ ఈ పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసంజీత్ మాట్లాడుతూ.. ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, సమాజ సేవలో మరిన్ని కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఆయనకు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు అభినందనలు తెలిపారు.



# 99 రోజుల కార్యాచరణలో సంక్షేమవారం పకడ్బందీగా చేపట్టాలి

## - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య

**నస్పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి సంక్షేమవారం కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వారంలో భాగంగా సంక్షేమ వసతి గృహాలను వంటశాల, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. వంటశాలను పరిశీలించి విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి శుభ్రతతో పాటు పోషక విలువలు కలిగేలా ఆహారాన్ని సిద్ధం చేయాలని, పరిసరాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిపై జిల్లా విద్యాశాఖాధికారి, సహాయ ఇంజినీర్‌తో మాట్లాడి పనులను వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. విద్యార్థినులతో మాట్లాడి చదువు, వసతి, ఆహారం వంటి అంశాలపై వివరాలు తెలుసుకుని ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ వారం ప్రత్యేక అధికారి, మండల విద్యాధికారి పద్మజ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్‌లో ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు

**నిర్మల్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ పాల్గొని బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ.. నాటి కాలంలోనే సమాజంలోని అసమానతలను తొలగించి, సమానత్వం కోసం బసవేశ్వర మహారాజ్ విశేష కృషి చేశారని కొనియాడారు. మహిళల హక్కుల కోసం, లింగ వివక్ష నిర్మూలన కోసం పోరాడిన గొప్ప సంస్కర్త ఆయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వరుడి బోధనలను స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థలను తనిఖీ చేసిన తహసీల్దార్, ఎంపీడీవో

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

ప్రజా పాలన ప్రగతి 99 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పలు విద్యా సంస్థలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ సరిత మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలను సందర్శించగా, ఎంపీడీవో రమాకాంత్ కేజీబీవీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాలల్లోని వంటగది, స్టోర్ రూమ్, భోజన సౌకర్యాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు బాగుంటేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించి, వారితో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరేందర్ రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ నవిత, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.




పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రమాకాంత్

## ఉట్నూర్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించిన ఖానాపూర్ ఎమ్మెల్యే

**ఉట్నూర్, ఏప్రిల్ 20,ప్రభాతవార్త**

మండలంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులకు భూమి పూజ చేసి సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్ తో కలిసి పనులను ప్రారంభించిన నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.పాత బస్టాండ్ నుండి ఆర్అండ్బి రోడ్డు వరకు రెండు పక్కల సీసీ రోడ్డు, 50 స్ట్రీట్ లైట్స్ ఏర్పాటుకు టెంకాయ కొట్టిన ఎమ్మెల్యే. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉట్నూర్ పట్టణాన్ని అబివృద్ధి చేయడమే లక్ష్యంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాం, హద్దులు దాటిన నిర్మలను తొలగించడం తో ప్రస్తుతం వ్యాపారస్తులకు ఇబ్బంది కలిగిన , అబివృద్ధి తో ఉట్నూర్ పట్టణం రూపురేఖలు మారుతాయి అన్నారు. అబివృద్ధికి సహకరించాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిదీ అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రత్యేక నిధులతో గ్రామాలు ,పట్టణాలు అబివృద్ధి చెందుతున్నాయి అన్నారు. ఫైర్ డిపార్ట్మెంట్ అధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ రెసిస్టెన్స్ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉట్నూర్ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్,ఉప సర్పంచ్ మస్రత అన్సా రీ, ఈ ఓ శంకర్,వార్డ్ సభ్యులు , ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



అబివృద్ధి పనులకు సర్పంచ్ అనిత శ్రీనివాస్ తో కలిసి భూమిపూజ చేసిన వెడ్మ బొజ్జు పటేల్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పరచ సాయన్న

## ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం

**జార్‌హత్నూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

ఎండలు మండుతున్న వేళ బాటసారులు, ప్రయాణికుల సౌకర్యార్థం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని సోనాల-ఇచ్చోడ ప్రధాన కూడలిలో గల శివాజీ విగ్రహ ఆవరణలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పరచ సాయన్న రిబ్బన్ కత్తిరించి ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి ఏటా ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల గ్రామానికి వచ్చే ప్రయాణికులకు మరియు ఆటో డ్రైవర్లకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు కొత్త శంకర్, నానం రమణ, దేగామ ఉపసర్పంచ్ బొడ్డు భోజన్న, ఆటో డ్రైవర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



గడ్డన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

## ఘనంగా మాజీ మంత్రి గడ్డన్న వర్ధంతి వేడుకలు

**భైంసా, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

మాజీ మంత్రి గడ్డన్న 22వ వర్ధంతిని పురస్కరించుకుని భైంసా మండలంలోని దేగాం గ్రామ బస్టాండ్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామస్తులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాయక్ వాడ్ గంగాధర్ మాట్లాడుతూ.. గడ్డన్న ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన ఎల్లప్పుడూ ముందుండేవారని గుర్తుచేశారు. సుమారు 50 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగి, మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డన్న కుమారులు, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సూర్యం రెడ్డితో పాటు మాజీ సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్, మాజీ విడిసి చైర్మన్ టేకుల లింగన్న పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేష్ మాశెట్టి వార్, చోండి రాజేశ్వర్, రాజన్న, వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## గాయకుడు కదంబ రత్నాకర్‌కు విశిష్ట సన్మానం

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

అక్షర జ్ఞానం లేకపోయినా స్వీయ ప్రతిభతో పాటలు రచించి ఆలపిస్తున్న గాయకుడు, రచయిత కదంబ రత్నాకర్‌ను దిలావర్‌పూర్ ఆదర్శ పాఠశాల యాజమాన్యం సోమవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రత్నాకర్‌కు ప్రాథమిక అక్షర పరిజ్ఞానం లేకపోయినా, స్వతహాగా కవిత్వం రచిస్తూ, స్వరపరుస్తూ పాడుతున్న తీరు అద్భుతమని కొనియాడారు. ఇటీవల అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన ఆలపించిన స్వంత రచనలు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. ఆయన ప్రతిభను గుర్తించి గ్రామస్తులు సైతం ప్రశంసలు కురిపించారు. భవిష్యత్తులో రత్నాకర్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కదంబ రత్నాకర్‌ను సన్మానిస్తున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్

## మే 1న అక్రిడిటేషన్ల జారీకి చర్యలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త



ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న పాత్రికేయులకు మే 1 నుండి అక్రిడిటేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కె.హరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తూ వాటిని పరిష్కరించడంలో భాగస్వాములు అవుతున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు




అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## ఐసిడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం

లక్షెట్టిపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీవాణి ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సోమవారం రోజున బలరావుపేట గ్రామంలో పోషణ పక్షం ప్రోగ్రాం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమానికి కి వెంకట్రావు పేట ఐసీడీఎస్ సూపర్ వైసర్ వాణి, బలరావుపేట సర్పంచ్ తిరుమల, ఉప సర్పంచ్ శ్రావణ్, హాజరై, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి, ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి. గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, మొదటి 1000 రోజుల సంరక్షణ, మొదటి 5 సంవత్సరాలలో పిల్లల మెదడు అభివృద్ధి, ఎదుగుదల గురించి చెప్పారు. అనంతర చిన్నారులకు అక్షరాభ్యాసం,అన్న ప్రాసన చేయించారు. అంగన్వాడీ కేంద్రం లో చిన్నారులకు ఉపసర్పంచ్ శ్రావణ్ పలకలు కొనివ్వడం జరిగింది.అనంతరం పోషణ పక్షం ప్రతిజ్ఞ చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయుడు సత్తయ్య, పంచాయతీ సెక్రటరీ శృతి, రమ, అంగన్వాడీ టీచర్లు, ఆశ, గర్భిణీ బాలింతలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఏప్రిల్ 20, ప్రభాతవార్త

అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని బుద్దికొండ గ్రామంలో గొల్ల నారాయణ నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఇంటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన అర్హులందరికీ రెండవ విడతలో ఇళ్లు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# మహర్షి శ్రీ భసవేశ్వర చరిత్రను భావితరాలకు అందించాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్: 20, ప్రభాతవార్త :



నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ హరిత

మహర్షి శ్రీ భసవేశ్వరుడి జీవిత చరిత్రను భావితరాల వారికి అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహర్షి శ్రీ భసవేశ్వర జయంతి కార్యక్రమానికి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్లా మంగ, గారితో కలిసి కలెక్టర్ హరిత ఆయన చిత్ర పటానికి పులా మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహర్షి భసవేశ్వరుడు 12 వ శతాబ్దపు గొప్ప భారతీయ తత్వవేత్తయని, సంఘ సంస్కర్త లింగాయత్ స్థాపకుడని కలెక్టర్ గుర్తుచేశారు. సమాజంలో కుల వివక్షత వర్ణ బేదాలు, లింగ వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది అన్నారు. సమానత్వం ప్రేమ భక్తీ బోదిస్తూ కుల వ్యవస్థపై తీవ్రంగా పోరాటం చేశారన్నారు. అయనను విశ్వ గురు అని కుడా పిలుస్తారని తెలిపారు. అలాంటి మహనీయుల చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకొని భావితరాల వారికి అందించాలన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో ఘనంగా అవార్డుల ప్రధానోత్సవం

### - తెలుగు సంస్కృతి, సాహిత్య ప్రోత్సాహానికి కృషి

మందమర్రి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త



అవార్డు అందుకుంటున్న గరిగె సుమన్

తెలుగు సంస్క్రుతి, సాహిత్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో విస్తరింపజేయడమే లక్ష్యంగా తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్క్రుతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలు సంయుక్తంగా ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాచవరం గౌరీశంకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి కత్తోజు, దైవజ్ఞ శర్మ, సూరేపల్లి విజయల పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా సిహెచ్ ప్రసన్న లక్ష్మీ, ఎం లలిత, రంగ ప్రసన్న కుమారి, కొండ్ర రమాదేవి, సన్నమూరి శ్రీనివాస్, తూముల మణికోట రాజశేఖర్, కుందారం సంజయ్, జి ఉమాదేవి, మంజుల పూజారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రతిభావంతులను శాలువాలతో సత్కరించి, పురస్కారాలు, జ్ఞాపికలు అందజేశారు. జర్నలిస్ట్ విభాగంలో మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన పబ్లిక్ టీవీ జర్నలిస్ట్ గరిగె సుమన్‌కు జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. అతిథులు మాట్లాడుతూ, తెలుగు సంస్క్రుతి, సాహిత్య పరిరక్షణతో పాటు ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకురావడంలో ట్రస్ట్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో సంక్షేమ పథకాల అవగాహన కార్యక్రమం

లక్షెట్టిపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త



ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఆశ్రమ పాఠశాలలో వెల్ఫేర్ వీక్ తేదీ 20 నుంచి 26 వరకు నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బండ జీవరత్నం తెలిపారు. సోమవారం రోజు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో కే. సరోజ పైన తెలిపిన షెడ్యూల్ లో భాగంగా సంక్షేమ పథకాల గురించి వివరించడం జరిగింది. పాఠశాలను సందర్శించి కార్యక్రమంలోని వివిధ అంశాలను, పాఠశాల పరిసరాలను, వంటగదిని, పరిశీలించి విద్యార్థులతో మాట్లాడడం జరిగింది. ఆరోగ్య పరిశుభ్రత పై అవగాహన కలిగి ఉండాలని, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి వారం రోజులపాటు పాఠశాల లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బండ జీవరత్నం, వార్డెన్ రేవతి, ఉపాధ్యాయులు మాడవి శంకర్, మంజుల, రజిత, వినోద, ఏఎన్ఎంలు సుమిత్ర, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా మైనారిటీ పాఠశాల, కళాశాలల విద్యార్థులు

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త



ఇంటర్ ఫలితాలలో జిల్లా మైనారిటీ పాఠశాల, కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ఆర్.ఎల్.సి. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా షగుఫ్తా ఫిర్దౌస్‌లతో కలిసి మైనారిటీ విద్యాసంస్థల విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లాలోని బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ మైనారిటీ పాఠశాల, కళాశాలలలో 202526 సంవత్సరంలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులలో రాణించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోనే 2వ స్థానంలో మైనార్టీ విద్యార్థులు నిలువడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించడంలో అధ్యాపకులు, ప్రిన్సిపల్స్ చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ తహరుద్దీన్, అకాడమిక్ సమన్వయకర్త రిజ్వాన్, మంచిర్యాల ప్రిన్సిపల్ సంధ్యా, బెల్లంపల్లి ప్రిన్సిపల్ యం.డి.నీలు తదితరులు పాల్గొన్నారు.



మద్యం విక్రయాల నిషేధంపై తీర్మానం చేస్తున్న సర్పంచ్ ఆసిఫ్ ఖాన్

## బోరిగామలో అక్రమ మద్యం విక్రయాల నిలిపివేత

### - గ్రామ పంచాయతీ తీర్మానం

**సిరికొండ, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలను నేటి నుంచి పూర్తిగా నిలిపివేస్తున్నట్లు సర్పంచ్ ఆసిఫ్ ఖాన్ ప్రకటించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి, ప్రజల ఆరోగ్యానికి ఆటంకంగా మారిన అక్రమ దందాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ దుకాణాల వల్ల సామాన్య ప్రజలు, ముఖ్యంగా కూలీలు తాము కష్టపడి సంపాదించిన డబ్బును మద్యానికి తగలేస్తున్నారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడమే కాకుండా, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని పేర్కొన్నారు. యువత కూడా ఈ అలవాట్లకు బానిసలై భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, అందుకే గ్రామ శ్రేయస్సు దృష్ట్యా బెల్ట్ షాపులను అరికట్టాలని గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.నేటి నుంచి గ్రామంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హెచ్చరించారు. అక్రమ విక్రయదారులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు పోలీసు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్తులందరూ, ముఖ్యంగా మహిళలు, యువత ఈ నిర్ణయానికి సహకరించి బోరిగామను మద్యపాన రహిత గ్రామంగా మార్చేందుకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కుల గణనలో గంగపుత్ర సంఘం పేరుకు చోటు కల్పించాలి

### - సబ్ కలెక్టర్ మనోజ్‌కు వినతిపత్రం అందజేత

**బెల్లంపల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన జాబితాలో గంగపుత్ర సంఘం పేరు లేకపోవడం దారుణమని బెల్లంపల్లి పట్టణ గంగపుత్ర సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వంగల చక్రపాణి, కార్యదర్శి దామెర విజయ్, మాజీ అధ్యక్షుడు బాసబోయిన పోతరాజులు మాట్లాడుతూ బీసీఏ జాబితాలో తమ సంఘం మొదటి సీరియల్ నెంబర్‌లో అధికారికంగా ఉన్నప్పటికీ కుల గణన జాబితాలో పేరు లేకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో గంగపుత్రులను అగ్నికుల క్షత్రియ జాబితాలో చేర్చడం పట్ల కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మెట్టు సాయికుమార్ వెంటనే స్పందించి గంగపుత్ర సంఘాన్ని కుల గణన జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా గంగపుత్ర కులస్తులంతా ఏకమై నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దామీర సదానందం, ప్రధాన కార్యదర్శి మాదరబోయిన మల్లేష్, కోశాధికారి పెద్దపల్లి రామస్వామి, మాజీ ఉపాధ్యక్షుడు బాసబోయిన యుగేందర్, కార్యవర్గ సభ్యులు జీదుల రాములు, మాదరపోయిన గోపాల్, ముద్రగడ వెంకటి, పెద్దపల్లి మల్లయ్య, గరిగె రాజ్ కుమార్, రాసకట్ల శంకర్, జీదుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ నిబంధనలకు లోబడే బొగ్గు ఉత్పత్తి జరగాలి

### శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ - గనుల ఉత్పాదకత, విస్తరణపై అధికారులతో సమీక్ష

**నస్పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



గనుల ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణపై అధికారులతో సమీక్షిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్

కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనలకు లోబడి గనుల ఉత్పత్తి జరగాలని, పర్యావరణ పరిరక్షణను అధికారులు బాధ్యతగా తీసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా పరిధిలోని భూగర్భ, ఉపరితల గనుల ఉత్పత్తి, ఉత్పాదకత, పర్యావరణ హిత చర్యలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గనుల విస్తరణలో భాగంగా పర్యావరణ అనుమతులు, నిబంధనల కొనసాగింపుపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ గనులు, ఓపెన్ కాస్టులలో ప్రస్తుతం ఉత్పత్తి కొనసాగుతున్న ప్రదేశాలు, కొత్తగా ఉత్పత్తి ప్రారంభించాల్సిన ప్రదేశాలకు సంబంధించి పర్యావరణ శాఖ నుంచి పొందాల్సిన అనుమతులు, పాటించాల్సిన నియమాలపై సుదీర్ఘంగా చర్చించారు. బొగ్గు వెలికితీత సమయంలో కాలుష్యానికి ఆస్కారం లేకుండా చేపడుతున్న చర్యలను ఏరియా ఎన్విరాన్మెంటల్ అధికారి హనుమాన్ గౌడ్ పీపీటీ ద్వారా వివరించారు. పర్యావరణ విభాగం ప్రదర్శించిన అంశాలను పరిశీలించిన జీఎం, నిబంధనల అమలులో ఎటువంటి అలసత్వం వహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ రమణా రావు, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి, ఎస్సార్పీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆర్.కె 5 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, ఎన్విరాన్మెంటల్ అధికారి హనుమాన్ గౌడ్, వివిధ విభాగాల అధిపతులు, గనుల మేనేజర్లు, రక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన్ స్థలాన్ని కాపాడాలి

### - అక్రమ ఆక్రమణలపై చర్యలకు దళిత సంఘాల డిమాండ్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణంలో ఉన్న అంబేద్కర్ ఫంక్షన్ హాల్ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ స్థలం దళిత సమాజానికి ఎంతో ప్రాధాన్యత కలిగినదని, కానీ ప్రస్తుతం కొంతమంది వ్యాపారులు అక్రమంగా ఆక్రమించి స్వప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చెందిన ఈ స్థలాన్ని కాపాడి, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేలా చేయాల్సిన బాధ్యత స్థానిక పాలకవర్గాలపై ఉందని వారు స్పష్టం చేశారు. అదేవిధంగా, సంవత్సరాలుగా మధ్యలోనే నిలిచిపోయిన అంబేద్కర్ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు. ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తయితే పట్టణంలోని దళిత ప్రజలకు వివాహాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. అక్రమ ఆక్రమణలను వెంటనే తొలగించి స్థలాన్ని ఖాళీ చేయించాలని, నిర్మాణ పనులను పునఃప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు దళితరత్న కుంభాల రాజేష్, ప్రధాన కార్యదర్శి రత్నం ఐలయ్య, కోశాధికారి గొడిసెల శ్రీహరి, గౌరవ సలహాదారులు కామెర దుర్గయ్య, ముఖ్య సలహాదారులు దాసరి భానయ్య, బొంకురి రామచందర్, ఉపాధ్యక్షులు సుంకిత సమ్మయ్య, కుష్ణపెల్లి రాజలింగు, బందెల మురళి, గొడిసెల చంద్ర మొగిలి, కార్యదర్శులు పైడిమల్ల చంద్రశేఖర్, నాతరి కిరణ్, గజ్జల రాంనాథ్, సభ్యులు అంగూరి సుభాష్, ఎలుక ఆకాష్, పట్టి నవీన్, మద్దెల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేతకాని మాలలకు ఉపకులం కాదు, వర్గీకరణలో అన్యాయం

### - గెజిట్‌లో ప్రత్యేక గుర్తింపునకు నేతకానీ మహర్ సంఘం వినతి

**నస్పూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**



కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తున్న నేతకానీ మహర్ సంక్షేమ సంఘం నాయకులు

నేతకాని కులస్తులు మాలలకు ఉపకులం కాదని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు స్పష్టం చేశారు. తెలంగాణ ఎస్సీ వర్గీకరణ, కులగణనలో తమ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ ఆదేశాల మేరకు సోమవారం మంచిర్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ గెజిట్ లో మాలసాలె, నెట్కాని పేర్లను తొలగించాలని నాయకులు కోరారు. తమను నేతకానీలుగా గుర్తించి అధికారికంగా పేరు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తమ సామాజిక వర్గం 15 లక్షలకు పైగా జనాభా కలిగి ఉందని వివరించారు. ప్రస్తుతం కుల ధ్రువీకరణ పత్రాలు నేతకానీలుగానే తీసుకుంటున్నామని గుర్తు చేశారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే, కుల గణనలో నేతకాని పేరును తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జనాభా సంఖ్యను కూడా చూపించలేదని మండిపడ్డారు. తమకంటే తక్కువ జనాభా ఉన్న కులాలను ధృవీకరించిన ప్రభుత్వం 15 లక్షల పైబడి ఉన్న తమను గుర్తించకపోవడం సరికాదన్నారు. నేతకానీ జనాభా సంఖ్యను అధికారికంగా తెలపాలని కోరారు. తమను మాలలతో కలిపి ఉన్న గ్రూపు నుండి తొలగించాలని, మొదటి గ్రూపులో చేర్చి 3 శాతం రిజర్వేషన్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పెరుగు తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి కొండ గొర్ల శ్రీనివాస్, జునుగురు లక్ష్మణ్, జాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.